క్లుప్తంగా

ఖాసీంపేట గ్రామాన్ని సందర్శించిన డీపీవో



గ్రామాన్ని సందర్శిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

గన్నేరువరం: సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా మండలంలోని ఖాసీంపేట గ్రామాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సందర్శించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, రెండోదశ ఇంకుడుగుంతల నిర్మాణాలు పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంప మల్లీశ్వరీ, ఉప సర్పంచ్ బద్దం సంపత్ రెడ్డి, ఎస్‌బీఎం రమేష్, వేణు, రవీందర్, కార్యదర్శి ఆనంద్, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, రాజేశ్వరీ, సీఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీచర్ల ఆర్థికసాయం



ఆర్థికసహాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వి.శివాత్మిక, వి.అనూషల తండ్రి విజ్జిగిరి రంజిత్‌కుమార్ ఇటీవల మృతిచెందారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల కుటుంబ సభ్యులు రూ.పదివేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.సాంబయ్య, టీచర్లు సీహెచ్. వేణు, పద్మ, శంకర్, వెంకటరాజం, మారుతి, స్వామి, నాగరాజు, శ్రీదేవి, సమ్మిరెడ్డి, సత్యనారాయణ, అన్నపూర్ణ, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



షోకాజ్ నోటీస్ చూపుతున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: బీఆర్‌ఎస్‌లో చీలికలు వచ్చే విధంగా, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని తప్పించాలని మాట్లాడడం సరికాదని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో మాట్లాడారు. పార్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మార్కెట్ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి పార్టీ అంతర్గత విషయాలు విలేకర్ల సమావేశంలో మాట్లాడడం పార్టీ నిబంధనలకు విరుద్ధమన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మిరెడ్డికి షోకాజు నోటీస్ జారీ చేశారని వారం రోజుల్లో వివరణ ఇవ్వకుంటే పార్టీ సరైన నిర్ణయం తీసుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'కెప్టెన్'ను కలిసిన కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావును శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గూర్చి చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎరువుల దుకాణం తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏవో శ్రీనివాస్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఎరువులు, విత్తనాల ధరలు రాయాలని సూచించారు. గుళికలు, విత్తనాలు, ఎరువులు, పురుమందులు కొనుగోలు చేసే రైతులు రసీదులు తీసుకోవాలన్నారు. చీడపీడలు సోకకుండా నారుమడిలో గుళికలు చల్లుకోవాలన్నారు.

ఏళ్లుగా కొనసాగుతున్న పనులు

- డంపింగ్‌యార్డ్ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం
- రహదారుల పక్కనే చెత్త డంపింగ్
- కనిపించని రీసైక్లింగ్ విధానం



ఇప్పల్‌నర్సింగాపూర్ సమీపంలో కొనసా...గుతున్న డంపింగ్‌యార్డు నిర్మాణం

హుజూరాబాద్: పరిశుభ్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు స్వచ్ఛ సర్వేక్షణ్ వంటి కార్యక్రమాలతో మున్సిపాలిటీల మధ్య పోటీ నెలకొల్పింది. మరో వైపు కేంద్ర ప్రభుత్వం కూడా పట్టణాల స్వచ్ఛత కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతుంది. హుజూరాబాద్ మున్సిపాలిటీలో మాత్రం డంపింగ్ యార్డు పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఏళ్లుగా పనులు కొనసాగుతున్నాయి. ఎప్పటికీ పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఐదెకరాల స్థలం కేటాయింపు

మున్సిపల్ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ సమీపంలో రెవెన్యూ అధికారులు డంపింగ్‌యార్డు కోసం ఐదెకరాల స్థలం గుర్తించి మున్సిపాలిటీకి అప్పగించారు. రూ 2.18 కోట్లతో డంపింగ్‌యార్డుతో పాటు వర్మీకంపోస్టు షెడ్డు, ఎఫ్‌ఎస్‌టీపీ (ఘన వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్) పనులు చేపట్టడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రూ.50 లక్షలతో ఏడు స్వచ్ఛ ఆటోలను కూడా కొనుగోలు చేశారు. ఈ నిధుల నుంచే రూ.25 లక్షల వ్యయంతో చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయితే వర్మీకంపోస్టు షెడ్డు, ఎఫ్‌ఎస్‌టీపీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రహరీ పనులు పూర్తయినా రీసైక్లింగ్ విధానం కూడా నేటికి ప్రారంభానికి నోచుకోలేదు.

ఓ వైపు అవగాహన... రోడ్లకిరువైపులా చెత్త డంపింగ్

చెత్త బండికి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇయ్యండమ్మా.. వీధుల్లో వేయకండి... రోగాలను కొనితెచ్చుకోకండి అంటూ మున్సిపల్ అధికారులు అవగాహన, ప్రచారం నిర్వహిస్తూ పట్టణంలోని ఆయా వార్డుల్లో చెత్తను సేకరిస్తున్నారు. కానీ చెత్తను వేసేందుకు మాత్రం డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సేకరించిన చెత్తను సిబ్బంది ప్రస్తుతం కొత్తపల్లి సమీపంలో జమ్మికుంట రోడ్డు వైపు, ఆర్టీసీ డిపో క్రాస్ నుంచి వెళ్లే ఇప్పల్‌నర్సింగాపూర్ రోడ్డు పక్కన డంపింగ్ చేస్తుండడంతో ఆ పరిసర ప్రాంతాల ప్రజలు, వాహనాదారులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోజుకు 18 మెట్రిక్ టన్నుల చెత్తసేకరణ

హుజూరాబాద్‌లో రోజూ 18 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఐదు ట్రాక్టర్లు, ఏడు స్వచ్ఛ ట్రాలీ ఆటోలు, 18 పుష్‌కాట్స్‌ను వినియోగిస్తుండగా 108 మంది కార్మికులు పనిచేస్తున్నారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో సిబ్బంది రహదారులకు ఇరువైపుల ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్నారు. ప్రస్తుతం కొత్తపల్లి గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు కోసం కేటాయించిన స్థలంలో చెత్తను డంపింగ్ చేస్తున్నామని అధికారులు పేర్కొంటుండగా దూరభారంతో అప్పుడప్పుడు పట్టణ సమీపంలోని ఖాళీ స్థలాల్లోనే చెత్తను వేస్తున్నారు. ఇప్పటికైనా డంపింగ్‌యార్డు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



డంపింగ్‌యార్డు పనులు తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. కొన్ని కారణాలతో పనుల్లో ఆలస్యం జరిగింది. ఇటీవల పనులు చేపట్టాం. ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నిర్దేశించిన ప్రకారం పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించాం. సేకరించిన చెత్తను ప్రస్తుతం కొత్తపల్లి డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందికి చెప్పాం. రోడ్ల పక్కను చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

చిత్ర కథ

చెత్తను తొలగించండి



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ పరిధిలోని పాత బైపాస్ రోడ్డు వెంట చెత్త పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే చెత్తవేసి కాల్చివేస్తుండటంతో ఇబ్బందులు పడుతన్నామని, రోడ్డుపై చెత్తాచెదారం వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బైపాస్ రోడ్డులోని కాలనీవాసులు కోరుతున్నారు.

పడేదాకా పట్టించుకోరా..?





రామడుగు: కరెంట్ సార్లు జెర్రంత మా ట్రాన్స్‌ఫార్మర్ (ఎస్ఎస్-3) వద్ద ఉన్న పవర్‌కట్ పాయింట్‌ను చూడండి అని రైతులు వేడుకుంటున్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి పవర్ కట్ పాయింట్ విద్యుత్ స్తంభాల్లో ఒకటి తుప్పపట్టి ఎప్పుడు పడిపోతుందో తెలియదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఇకనైనా కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

త్వరలో 'డబుల్' గృహ ప్రవేశం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల గృహ ప్రవేశం త్వరలో చేయిస్తామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం ఇళ్లను పరిశీలించి మిగులు పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ దామెర విద్యాసాగర్ రెడ్డి, గొల్లగట్టయ్య, బందారపు అజయ్‌కుమార్‌గౌడ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అర్నకొండకు చెందిన ఆవుల రవి (46) మృతి చెందగా ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవి కుమారుడిని ఉచితంగా చదివించేందుకు హామీ ఇచ్చారు.

సాయిచంద్ మృతి తీరనిలోటు

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్, కళాకారుడు సాయిచంద్ మృతి తీరని లోటని, 9న హైదరాబాద్‌లో నిర్వహించే దశదిన కర్మకు అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ సాంస్కృతిక చైర్మన్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి మానకొండూర్‌లో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం నుంచి ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచాడని గుర్తు చేశారు. ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్ హఠాన్మరణం కుంగదీసిందన్నారు. వీరి కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్, కేటీఆర్ ముందుకురావడం పట్ల కళాకారుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు ఒకనెల జీతం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, నాయకులు పిట్టల మధు, శాతరాజు యాదగిరి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కార్యకర్త చాడ శ్వేత మృతిచెందారు. శుక్రవారం మండలంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో భర్త సతీశ్‌రెడ్డికి రూ. రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందించారు. అనంతరం రామంచలో నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులను, బోయిని ఎల్లయ్య, రాజిరెడ్డి, కుటుంబాలను పరామర్శించారు. వెంట చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఆయా గ్రామాల సర్పంచులు సుద్దాల ప్రవీణ్‌కుమార్, గుంటి మాధవి, బెజ్జంకి లక్ష్మణ్, బెజ్జంకి రాంబాబు నాయకులు తిరుపతిరెడ్డి, కిషన్‌రెడ్డి, సిద్దేంకి రాజమల్లు, దాసరి సాంబయ్య, మంకు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కే సిరాజ్, పలువురు పాల్గొన్నారు.

- **మానవ హక్కుల మండల కమిటీ**

శంకరపట్నం: మానవ హక్కుల కమిటీ శంకరపట్నం మండల కార్యవర్గాన్ని శుక్రవారం నియమించినట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేశ్ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా మొలంగూర్ గ్రామానికి చెందిన దండు సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా కన్నాపూర్ గ్రామానికి చెందిన మోతె సదయ్యను నియమించామని పేర్కొన్నారు.

- **మోదీ సభకు తరలి రావాలి**

తిమ్మాపూర్: వరంగల్‌లో 8న నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ సభకు కార్యకర్తలు నాయకులు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర్‌రావు పిలుపునిచ్చారు. తిమ్మాపూర్ మండలంలో మానకొండూరు నియోజవర్గం ముఖ్య నాయకులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సన్నాక సమావేశంలో మాట్లాడారు.

- **రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాల సహకార సంఘం ఉద్యోగికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గట్టుదుద్దెనపల్లికి చెందిన పంజాల రమేశ్ (40) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా కరీంనగర్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న సరోజన

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం సర్పంచ్ వీర్ల సరోజన, దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని కోరారు. వీర్ల ప్రభాకర్‌రావు జన్మదినం పురస్కరించుకొని ఆలయలంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు కమిటీ సభ్యులు వీర్ల సంజీవరావు, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్‌రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం చుట్టూ..

మండల కేంద్రంలోని క్రీడా మైదానం చుట్టూ శుక్రవారం ఉపాధి హామీ కూలీలు మొక్కలు నాటా రు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ రావు, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పనులు పూర్తి చేయాలి

చొప్పదండి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. తడి, పొడి చెత్త, మురగునీటి నిర్వహణ, ఐఈసీ కార్యక్రమాలను పూర్తి చేసి సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఈసమావేశంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్, ఐకేపీ ఏపీఎం నర్మద, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



గంగాధర: కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు రైతుబంధు, రైతుబీమా పథకాలకు, దరఖాస్తు చేసుకోవాలని, మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ సూచించారు. మండలంలోని హిమ్మత్‌నగర్, పోతుగంటిపల్లి గ్రామాల్లో శుక్రవారం పత్తి పంటను పరిశీలించారు. అనంతరం వరిలో వెదజల్లే, డ్రమ్ సీడర్ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితుల ఆధారంగా వ్యవసాయ పనులు, పత్తి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. డీఏవో వెంట విస్తరణ అధికారులు గోపిచంద్, అనంతరాజు, రైతులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



గంగాధర: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



హుజూరాబాద్‌లో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

గంగాధర: మండలంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మల్లాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చిలుముల రాజయ్య, తడగొండ శంకర్, సముద్రాల శ్రీనివాస్, కొలిపాక స్వామి, దిలీప్,అశోక్, కార్తిక్, మల్లయ్య, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నియోజకవర్గ ఇన్‌చార్జి తునికి వసంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ పతాకం జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి ఆవిష్కరించారు. అనంతరం జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. జాతీయ నాయకులు రుద్రారపు రామచంద్రం, మారపల్లి శ్రీనివాస్, రేణికుంట్ల సాగర్, ఎంఈఎఫ్ నాయకులు తడికమల్ల శేఖర్, వేల్పుల రత్నం, పొడిశెట్టి వెంకటరాజం, మొలుగురి సదయ్య, బత్తుల రాజలింగం, రొంటాల చుక్కయ్య, మాడుగుల విజయ్ కుమార్, కడారి సుమన్, రొంటాల శంకర్, అంబాల బాబు, నదునూరు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినోత్సవం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో నాయకులు తడగొండ శంకర్‌లతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



చొప్పదండి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు.ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అనర్హత పిటిషన్‌పై స్టే కోరుతూ గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు పిటిషన్‌ను తిరస్కరించడంతో కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కావాలనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా కక్షకట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయాలనే కుట్రపూరత వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు.

రెండో రోజు జీపీ సిబ్బంది సమ్మె

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో జీపీ సిబ్బంది చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. డిమాండ్‌ల సాధన కోసం సమ్మె చేస్తున్నామని, అధికారులు విధుల్లో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని గ్రామ పంచాయతీ సిబ్బంది అధ్యక్షుడు రాచర్ల మల్లేశం ఆరోపించారు.

ఇల్లందకుంట: సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండలంలోని టేకుర్తి గ్రామ పంచాయతీ కార్మికులు ఆరోపించారు. మల్టీ పర్పస్ విధానాన్ని రదు, కారోబారు ,బిల్‌కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

జమ్మికుంట: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు పెరుగు అశోక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యలయం ఎదుట సమ్మెలో మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో సమ్మె చేస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో జీతాలు చెల్లించాలని, పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న హరీశ్

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఐత హరీశ్ హుజూరాబాద్ నియోజకవర్గ టీటీడీపీ కో ఆర్డినేటర్‌గా నియామకమయ్యారు. ఈమేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ చేతుల మీదుగా హరీశ్ నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రామడుగు: హైదరాబాద్‌లో 15న నిర్వహించే బీసీల రాజకీయ బాట ప్లీనరీ సమావేశం విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్లీనరీ కరపత్రాలను బీసీ సంఘం నాయకులు ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ.. జనాభా దామాషా పద్ధతి ప్రకారం రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల బాధ్యుడు అనుపురం వెంకటేష్‌గౌడ్, నాయకులు బత్తిని లక్ష్మణ్, వెంకటేష్, నవీన్, రామకృష్ణ, కిషన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో పురుషుల పొదుపు సమితి సభ్యుడు మిడిదొడ్డి మల్లయ్య ఇటీవల మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూపకు సమితి నుంచి బీమా నిధి రూ.డెబ్బైవేల మూడు వందల చెక్కును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పోగు రమేశ్, పర్యవేక్షకుడు అమరేందర్, చంద్రమౌళి, రాజకుమార్, అనిల్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, వీరయ్య, సదానందం, గణకులు వీరన్న, శ్రీనివాస్ ఉన్నారు.